ఒకానొక సందర్భంలో బంగ్లాదేశ్ చరిత్ర, బెంగాలీలకి బంగ్లాదేశ్ వాళ్లతో ఉండే ఫ్రిక్షన్ కొంతవరకు తెలిసింది. దేశాలైనా, రాష్ట్రాలైనా ఇద్దరు మనుషులైనా విడిపోవడానికి ప్రేమ రాహిత్యమే కారణమన్న పాయింట్‌ని ఆధారం చేసుకొని రాసిన కథ.

రిషి శ్రీనివాస్

# 8 ప్రవాసం





'నేను బెంగాలీ నేర్చుకోను,' అనుకున్నాను నాలో నేనే.

నిజానికి బెంగాలీ నేర్చుకోమని అశుతోష్ నన్నేమీ అడగలేదు.

ఒకవేళ తనే స్వయంగా అడిగి ఉంటే మా పెళ్ళైన తరువాత ఈ రెండేళ్లలో తను నన్ను కోరిన మొదటి కోరిక కనుక సరే... అనే దాన్నేమో !

అవునూ... మొదటి కోరిక ఎలా అయ్యిందీ....? రెండోదికదూ.

'చటర్జీ' అన్న తన పేరు నా పేరు వెనుక తగిలించుకోమని అడిగాడుగా. అది మొదటి కోరిక కదా!

అడిగాడా? ఎక్కడ అడిగాడు? 'తగిలించుకో...' అని ఆర్డర్ చేశాడు. కనుక అది కోరిక కాదు. ఆజ్ఞ.

త్రేతాయుగం స్త్రీ రెండు వరాలు పొందవచ్చును. కలియుగపు స్త్రీ రెండు వరాలు తీర్చవచ్చును.

'భాగీరథి రెడ్డి' కాస్తా 'భాగీరథి చటర్జీ'గా మారిపోతే ఎలా? మన ఫేస్‌బుక్ ప్రొఫైల్‌కి ఎవడిదో బొమ్మ పెట్టినట్లుండదూ?

చేపల పులుసు చేశాను. వాళ్ల బెంగాలీ స్టైల్లో చెయ్యమంటాడు.

''ఎందుకు చెయ్యను... అత్తయ్యగారికి ఫోన్ ఇవ్వు. ఎలా చెయ్యాలో అడుగుతాను. అత్తయ్యగారే నాతో మాట్లాడకపోతే బెంగాలీ చేపల పులుసు నాకెవరు నేర్పుతారు?'' అని అడుగుతాను.

''మన పెళ్లిని వాళ్లింకా ఒప్పుకోవడం లేదు,'' అని ఇంగ్లీష్‌లో దీనంగా చెప్తాడు.

ఇంటర్ క్యాస్టే ఒప్పుకోరు. మాది ఇంటర్ స్టేట్ కూడా. బెంగాలీ బ్రాహ్మర్లబ్బాయి, బొబ్బర్లంక రెడ్ల అమ్మాయి. టూ మెనీ క్వారల్స్ అండ్ కాంప్లికేషన్స్.

''గూగుల్ ఇట్,'' అన్నాడు.

యూట్యూబ్‌లో చూసి మర్నాడు చేస్తే అది నీరు పట్టేసి వికారంగా అయ్యేసరికి మళ్లీ బెంగాలీ వంటల జోలికి వెళ్లొద్దని వార్నింగ్ ఇచ్చి కారెక్కి ఆఫీసుకెళ్లిపోయాడు. అలా నా ప్రేమ 'నీరు' గారిపోయింది.

పొద్దున్న వంటయ్యాక అమ్మ ఫోన్ చేస్తుంది. అల్లుడు ఎలా ఉన్నాడని అడుగుతుంది అన్యమనస్కంగా. నాన్నగారు ఇంట్లో ఉన్నా పొలానికెళ్లారంటుంది. ఆరోగ్యం బాగోలేకపోయినా బాగున్నాం అంటుంది. నేను చేసిన పని వల్ల చెల్లికి మంచి సంబంధాలు రావేమోనని బెంగపడుతున్నానంటుంది. ఫోన్ పెట్టేస్తుంది.

పెట్టబోయే ముందు 'బెంగాలీ నేర్చుకుంటున్నావా?' అని అడిగి మరీ పెట్టేస్తుంది.

నేర్చుకోవాలా? నేను నేర్చుకోను. అలా అని బెంగాలీ అంటే ఇష్టం లేదనికాదు. తెలుగంటే ఇష్టమని. తెలుగువారి అస్తిత్వాన్ని కాపాడదామని. ఇంతటి గురుతర బాధ్యత నాకెందుకనా? చెప్తా.

నేను చిన్నప్పటి నుంచి చాలామంది ఇంటర్నేషనల్, ఇంటర్‌స్టేట్, ఇంటర్ రిలీజియస్ మేరేజెస్ చేసుకున్న తెలుగువాళ్ల గురించి విన్నాను. కొందర్ని చూశాను. ఈ సదరు ఇంటర్ లేంగ్వేజ్ మేరేజెస్ చేసుకున్న తెలుగువాళ్లు... చచ్చినట్లు తమ జీవిత భాగస్వాముల భాష నేర్చుకుంటారు తప్ప వారి మెరుగైన సగాలు (బెటర్ హాఫ్స్ తర్జుమా!) చస్తే తెలుగు నేర్చుకోరని నా యొక్క నిశ్చితాభిప్రాయం.

చాలా శాతం కేసుల్లో మన తెలుగు సగాలకి ఆల్రెడీ అవతల వాళ్ల భాష వచ్చేసుంటుంది. ఇహనేం ఆ మిగతా సగం మన భాష నేర్చుకుంటుందా? అందుకే అశుతోష్ తెలుగు నేర్చుకుంటే కున్నాడు. లేదంటే లేదు. ఇంగ్లీష్ అక్కరకొస్తుంది. నేను మాత్రం బెంగాలీ నేర్చుకునే సమస్య లేదు. తెలుగు తోడు వెతుక్కున్న బెంగాలీ నైటింగేలే తెలుగులో కూతపెట్టలేదు. ఇంక నేనెంత?

కాలింగ్ బెల్ మ్రోగింది. అమెజాన్ కొరియర్. పక్క ఫ్లాట్‌కి తాళం వేసి ఉండడంతో ఆ కొరియర్ని నన్ను తీసుకోవల్సిందిగా హైదరాబాదీ ఉర్దూ కలిసిన హిందీలో చెప్పాడు కొరియర్ బాయ్. నేను చేతులు చాపకపోవడంతో వాడి చెవికి భుజానికి మధ్యనున్న సెల్ ఫోన్ నాకు ఇచ్చి  మాట్లాడమన్నాడు.

ఫోన్‌లో పక్క ఫాట్‌లో ఉండే అతను అనుకుంటా. ఆఫీస్‌లో ఉన్నాను. దయ చేసి కొరియర్ తీసుకోండి... సాయంత్రం వచ్చి మీ దగ్గర నుంచి తీసుకుంటానని అభ్యర్థించాడు.

ఇంత మర్యాదగా మాట్లాడుతున్నాడంటే ఖచ్చితంగా హైదరాబాదీ కాదేమో! ఇంగ్లీష్‌లోనే మాట్లాడాడంటే తెలుగువాడేనేమో! ఏమో!

సాయంత్రం వచ్చాడు, అశుతోష్ రాక ముందే. అనిర్బాన్ అట పేరు. పూర్తి పేరు అనిర్బాన్ రే! సత్యజిత్ రే... లా లేదూ? బెంగాలీనా?

జుట్టుకి నూనె పెట్టి దువ్విన తీరు, ముఖంలో సౌమ్యత, సున్నితత్వం. చూడబోతే బెంగాలీ అన్నది స్పష్టం.

హైటెక్ సిటీలో ఏదో కంపెనీలో పని చేస్తున్నాడట.

కొరియర్ తీసుకున్నందుకు థ్యాంక్స్ చెప్పి షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

అశుతోష్ వచ్చి స్నానాలయ్యాక భోజనాలప్పుడు అనిర్బాన్ గురించి చెప్పాను.

మీ వాడేనట! అని.

ఎర్రగాచూశాడు.

"Met him in the lift. He is a Bangladesi (లిఫ్ట్‌లో చూశాను. వాడు మావాడు కాడు. బంగ్లాదేశ్ వాడు)," అన్నాడు.

ఈస్ట్ బెంగాల్ విడిపోయి పాకిస్తాన్‌లో కలిసిపోయినప్పుడు రాని కుటుంబాలన్నీ డెబ్బై ఒకటిలో బంగ్లాదేశ్ ఏర్పడ్డాక వెస్ట్ బెంగాల్‌కి వలస వచ్చాయని ఆగి ఆగి చెప్పాడు ముద్ద ముద్ద తినే విరామంలో.

అలా వలస వచ్చిన కుటుంబాలకి ఇండియాలో స్థిరనివాసం ఏర్పాటు చెయ్యడానికి భారత ప్రభుత్వం అశుతోష్‌లాంటి జమిందారీ (ఒకప్పుడు) కుటుంబాల ఆస్థులు స్వాధీనపరచుకుందని చెప్పాడు చేతులు కడుక్కుని.

"అదా కడుపుమంట?"

"కీ?????"

"అదే... కారం తిని కడుపు మండినట్లుంది రసగుల్లా తింటావా?"

"హ్యా."

ఫుట్‌బాల్ పెట్టాడు.

"మ్యాంచెస్టర్ చూస్తావా?" అని అడిగితే,

"మెగాస్టార్‌ని చూస్తా," అని చెప్పాను.

'కోరికోరి కాలుతుంది ఈడు ఎందుకో...' అంటున్నాడు రౌడీ అల్లుడు.

'కునుకేదీ కనబడదే ఎటు వెళ్లిందో ఏమో! లోకాలను జోకొట్టే పనిలో ఉందేమో!

'కొంగు విడిచిపెట్టని నా సిగ్గెటుపోయిందో! జతపురుషుని చేరేందుకు సిగ్గుపడిందేమో!' పాట హాల్లో ప్లే అవుతున్నా పాట మొదలైన పది సెకెన్లకే బెడ్రూంలోకి వెళ్లిపోయిన మాకు వినబడడం లేదు.

వర్ణమాలలో అచ్చులు ఎన్నో విరామం లేకుండా అచ్చులు వేసి వివరించి అలిసిన కాస్త నిశ్శబ్దంలో 'చందమామ నిదుర చెదరనీ... హా' అని సిరివెన్నెలనడం మాత్రం వినబడింది.

కోల్డ్ కాఫీ కబుర్లు మొదలెట్టాడు.

"Don't talk to them (వాళ్లతో మాట్లాడకు)," అన్నాడు నా వేళ్లు నిమురుతూ.

"ఎవరితో..."

"With that east fellow (అదే ఆ ఈస్ట్ ఫెలోతో)."

"అతను ఈస్ట్ బెంగాలీ అని నీకెలా తెలుసు?"

"With his dialect (బెంగాలీ మాట్లాడే యాస బట్టీ తెలిసిపోతుంది)."

"వాళ్ల యాసకి ప్రత్యేకమైన లిపి, ప్రత్యేకమైన భాష అనే గుర్తింపు లేవా?" అడిగాను తన కనుబొమ్మలు నిమురుతూ.

"యాసకి భాషగా గుర్తింపేమిటీ?" అన్నట్లు చూశాడు.

దబాయించి పోరాడ్డం చేతకాదు. ప్చ్.

రోజూలాగానే పదిగంటలకి ఫోన్ వచ్చింది. అశుతోష్ వాళ్లమ్మ. అదే... మా అత్తయ్యగారు. రోజూ రాత్రి భోజనాలయ్యాక కొడుక్కి ఫోన్ చేస్తుంది. కనీసం ముప్పావు గంట మాట్లాడతాడు.

"ఎవరు?" అని అడుగుతాను తెలిసినా.

"తొమర్ ససురి" అంటే మీ అత్తయ్యగారు అని. నాకొచ్చిన ఏకైక బెంగాలీ పదం.

"నాతో మాట్లాడరా?"

పెదవి విరుస్తాడు. రోజూ తను మాట్లాడతాడు. రోజూ నేను అడుగుతాను. మన పెళ్లిని ఒప్పుకున్నారా అని. అదే జవాబు. 'Takes Time' అని. ఒక్కరోజు కూడా మీ అమ్మానాన్నా ఒప్పుకున్నారా అని అడగడు.

అయినా ఆడపిల్ల తల్లిదండ్రుల ఒప్పుదల ఎవడిక్కావాలి ? తెల్లవారిపోయింది.

❖

ఆ రోజు సాయంత్రం ఆఫీస్నుంచి ఎంగిలి టప్పర్ వేర్‌తో పాటు ఒక వార్తను కూడా మోసుకొచ్చాడు అశుతోష్.

అమెరికా వెళ్తున్నానని.

మూడునెలలకే. బిజినెస్ వీసా. షార్ట్ ట్రిప్. ఎల్లుండే బయలుదేరాలి. నన్ను మా ఊరెళ్లిపొమ్మంటాడు.

"మా ఇంట్లో మాత్రం... నన్ను రానిస్తారనుకున్నావా?"

'ఏం రోగం?' అన్నట్లు చూసి డెబిట్ కార్డ్ చేతిలో పెట్టాడు.

"ఒన్ లాక్ ఉంది. సరిపోతుందనుకుంటున్నా," అనడంలోనే 'సరిపెట్టుకో' అన్న భావం ఉంది.

రెండు రోజుల్లో శంషాబాద్ విమానాశ్రయంలో ఫ్లైట్ ఎక్కి ఎగిరిపోయాడు.

❖

ఓరోజు అనిర్బాన్ తలుపు కొట్టాడు. మొన్న తీసుకున్న అమెజాన్ కొరియర్ రిటర్న్ ఇచ్చేస్తున్నానని... వాడు తీసుకోడానికి వస్తే ఇచ్చేయమని... తను ఆఫీస్‌కి వెళుతున్నానని చెప్పాడు.

"మీరేం అనుకోకపోతే ఇందులో ఏముందో తెలుసుకోవచ్చా?" అని అడిగాను.

"హే రాం సినిమా," అన్నాడు కొంచెం మొహమాటపడి. హిందీ హే రాం అనుకుని ఆర్డర్ చేస్తే తమిళ హే రాం డివిడి వచ్చిందట. అందుకే రిటన్ చేసేస్తున్నాడట.

హే రాం అంటే నా అభిమాన నటుడు కమల్‌హాసన్ సినిమా అని విన్నాను. తెలుగు డబ్బింగ్ దొరక్కపోయేసరికి చూసే అవకాశం దొరకలేదు.

మీరేం అనుకోకపోతే ఈ డి.వి.డి. నాకు ఇస్తారా అని అడిగేశాను. నవ్వుతోనే తన ఒప్పుకోలునూ తెలియజేసి వెళ్లిపోయాడు.

చెన్నై సత్యభామ యూనివర్సిటీలో ఎం.టెక్ అయిపోయిన దగ్గర్నుండి తమిళ్ సినిమాలతో టచ్ పోయింది. సినిమా పెట్టుకు చూద్దామని ల్యాప్‌టాప్ కోసం వెతికితే అశుతోష్ యూ.ఎస్. తీసుకు వెళ్లిపోయాడని అర్థం చేసుకుని నిరుత్సాహపడ్డాను.

❖

సాయంత్రం కింద లాన్‌లో వాకింగ్ చేస్తుంటే అనిర్బాన్ వచ్చి కలిశాడు.

హే రాం సినిమా చూసానేమోనని కనుక్కున్నాడు. ల్యాప్‌టాప్ లేదని చెప్పేసరికి వాళింట్లో హోం థియేటర్ ఉందని, అక్కడ చూస్తే తను కూడా చూసినట్లు ఉంటుం దని అన్నాడు. అడగ్గానే డి.వి.డి. ఇచ్చిన మనిషికి కాదని ఎలా చెప్పడం?

ఇద్దరం కలిసి చూశాం. ప్రతి వాక్యం పాజ్ చేసి దాని అర్థమేమిటో వివరిస్తూ చూసేసరికి మూడు గంటల సినిమా ఆరుగంటలు పట్టింది.

ఆ సినిమాలో చూపించింది నూటికి నూరుపాళ్లు నిజమంటాడు అనిర్బాన్. ఈస్ట్ బెంగాల్‌ని పాకిస్తాన్‌లో కలిపే సమయానికి 1947లో జరిగినట్లుగా చూపించిన హిందూ-ముస్లిం అంతఃకలహాలు నిజంగా జరిగాయంటాడు.

ఈస్ట్ పాకిస్థాన్‌లో మహిళలపై ఈ సినిమాలో రాణీముఖర్జీపై జరిగిన రీతిలోనే దాడులు జరిగాయట. అప్పుడు ఈస్ట్ పాకిస్తాన్ నుంచి భారీగా హిందువుల వలస వెస్ట్ బెంగాల్‌కి వచ్చిందట.

వాళ్లంతా తమ గడ్డపై తమకున్న ఇళ్లు, స్థలాలు, పొలాలు వదులుకొని కట్టు బట్టలతో వలస వచ్చారట. అలా వచ్చిన కుటుంబాలలో అనిర్బాన్ కుటుంబం కూడా ఒకటట. ఎన్ని 'ట' లో కదా! నిజాలైతే అబద్ధాలుగా మారిపోతే బాగుణ్ణు.

మరి 1971 యుద్ధం ఎందుకొచ్చిందని అడిగితే మళ్లీ ఒక నవ్వు. భాష గురించి అట! ఈస్ట్ పాకిస్థాన్ వాళ్లు తమకు అలవాటైన బెంగాలీ మాట్లాడతామని. ఉర్దూ మాత్రమే మాట్లాడాలి, బెంగాలీని పూర్తిగా అధికారిక, వ్యవహారిక భాషగా విసర్జించాలని వెస్ట్ పాకిస్థానీల పట్టు. అది నచ్చక మళ్లీ దాడులు, వలసలు, కష్టాలు వెరసి యుద్ధం. బంగ్లాదేశ్ ప్రసూతి.

అశుతోష్ చెప్పిన దానికి అనిర్బాన్ చెప్పిన దానికి పొంతన కుదిరింది. అక్కడ పాకిస్థాన్ వాళ్లేమో హిందువులకు తరిమికొడితే ఇక్కడ అశుతోష్ లాంటి బెంగాలీలేమో, 'ఇలా వలస వచ్చిన బెంగాలీల వల్లనే మా జమీన్లు మాకు కాకుండా పోయాయి,' అని వీళ్లని హీనంగా చూస్తున్నారు.

వీళ్ల ఆస్థులు బంగ్లాదేశ్‌లో ఉండిపోవడం వల్ల వలస బెంగాలీలు, వాళ్ల వలస వల్ల ఆస్తులు కోల్పోయిన వెస్ట్ బెంగాలీలు మొత్తం మీద బెంగాల్ జాతి మొత్తం పెద్దగా సిరిసంపదలు లేకుండా రోజులు నెమ్మదిగా నెట్టుకొస్తున్నారన్నమాట.

సినిమా అయిపోయింది. ఆన్‌లైన్‌లో హిందీ వెర్షన్ దొరుకుతుంది కదా డబ్బులు పెట్టి కొనడం ఎందుకు అని అడిగితే గాంధీ గురించి తీసిన సినిమా దొంగతనం చెయ్యడం ఇష్టంలేక అని నవ్వుతాడు.

భోజనానికి ముగ్దాల్, ఆలూ పొస్తో చేశాడు. వాళ్ల పద్మా నదిలో పులసలు దొరుకుతాయంట. దాన్ని ఇల్లిష్ అంటారని చెప్పాడు.

భోజనం చాలా రుచిగా ఉంది. అశుతోష్ యూ.ఎస్. నుంచి వచ్చేలోపు బెంగాలీ వంటలన్నీ నేర్చుకుని సర్ప్రైజ్ చేద్దామనుకున్నాను. అనిర్బాన్ని నేర్పమంటే ఎప్పటిలాంటి సమాధానమే! ఒక నవ్వు.

అనిర్బాన్ వారానికి ఒక్కరోజే ఆఫీస్‌కి వెళ్లి మిగతా రోజులు వర్క్ ఫ్రం హోం చేసేవాడు. పొద్దున్నుండి రాత్రి వరకు బెంగాలీ సీరియల్స్ చూసేవాడు. నేను పగలంతా అతనింట్లోనే ఉంటూ బెంగాలీ వంటలు నేర్చుకునేదాన్ని. తన భార్యని కలవడానికి నెలకి ఒకసారి కోల్‌కత్తా వెళ్లినప్పుడు అక్కడి రసగుల్లా తెచ్చేవాడు.

కొన్ని రోజులకి అనిర్బాన్ పరిచయం వల్ల సుక్తో, పొస్తో, బెగున్ భాజా లాంటి వెజిటేరియన్ వంటలు... కోషా మంగ్షో, ముర్గిర్ జోల్ లాంటి నాన్‌వెజ్ వంటలు వండడంతో పాటు బెంగాలీ అర్థం చేసుకోగలిగే నేర్పుని కూడా కొంత సంపాదించాను.

మూడు నెలల్లో వస్తాడనుకున్న అశుతోష్ రెండున్నర నెలల్లోనే వచ్చేశాడు. సెమినార్ ఏదో ఉందని ఫ్లైట్ దిగిన మర్నాడే ఆఫీస్‌కి వెళ్లిపోయాడు. సాయంత్రం తనని సర్ ప్రైజ్ చేద్దామని ఇన్నాళ్లు నేర్చుకున్న విద్యంతా ప్రేమతో ప్రదర్శించి బెంగాలీ వంటలు ఘుమఘుమలాడించాను.

కానీ ఆన్‌సైట్ రిటర్న్ పార్టీగా ఇచ్చిన టీం డిన్నర్‌లో తినేసానని డైరెక్ట్‌గా బెడ్రూంలో దూరాడు.

రోజూలాగానే రాత్రి పదింటికి వాళ్లమ్మ నుంచి ఫోన్ వచ్చింది. ఈ రెండున్నర నెలల్లో అనిర్బాన్ వల్ల బెంగాలీ అర్థం చేసుకోగలిగే సామర్థ్యం ఏమాత్రం వచ్చిందో తెలుసుకోవాలనిపించి వాళ్ల సంభాషణ విన్నాను.

“హలో షోనా, కమొన్ అషో? అరె హ్యా, ఒ పషై ఆచె. ఓ అమ దెర్సొం పార్కె ర్కథ జానై న. బుజ్షె నా కిచు, సుధు టకియె అచె. (హలో డాలింగ్. ఎలా ఉన్నావ్? నా పెళ్లామా? అది ఇక్కడే ఉంది. తనకు మన గురించి తెలియదు. విన్నా ఏం అర్థం కాదులే.)

అంటూ ఇంకా ఏవేవో మాట్లాడాడు. కానీ నాకు ఆ మూడు ముక్కలే అర్థమయ్యాయి. జరుగుతున్నదేమిటో అర్థం అవుతున్నా కానట్లు నటించడం ఎంత కష్టమో తెలుసా? ఇంక నటించలేను అనుకున్నప్పుడు ఆ గదిలో నుంచి బయటకు వచ్చేశాను.

గంట తర్వాత ఫోన్ పెట్టేసి వచ్చి, "అమ్మ..." అన్నాడు నేనేదో అడిగినట్లు.

రాత్రి పాలలో ఒక నిద్రమాత్ర వేసి ఇచ్చాను. శుభ్రంగా పడుకున్నాడు.

తన ఫోన్ తీశాను. బయోమెట్రిక్ ఫేస్ రికగ్నిషన్ అన్-లాక్ పెట్టుకున్నాడు. తన ముఖం ముందు ఫోన్ కేమెరా ఆన్‌చేసి పెడితే మొబైల్ అన్-లాక్ అయ్యింది. ఫోన్ కాల్ లిస్ట్‌లో అద్రిజ అన్న అమ్మాయి నుంచి లాస్ట్ కాల్ వచ్చినట్లుంది. ఇన్నాళ్లు అమ్మతో మాట్లాడుతున్నానని అబద్ధం చెప్పి అశుతోష్ మాట్లాడింది దీనితోనేనా! గ్యాలరీలో ఫోటోలు. ఆ పిల్లవే. కాకపోతే తన ముఖం ఆనించుకున్న చాతీ మాత్రం అశుతోష్‌ది.

అదంటే అంత ఇష్టం ఉంటే దాన్నే చేసుకోవచ్చు కదా. నన్నెందుకు చేసుకున్నాడు? అనుమానమొచ్చి ఫేస్‌బుక్‌లో అద్రిజ ప్రొఫైల్ చూస్తే ఆ అమ్మాయి 'ఫ్రం ఢాకా లివ్స్ ఇన్ కోల్‌కత్తా,' అని ఉంది. బంగ్లాదేశీ.

అదీ సంగతి.

ఆ దేశం మీద తనకున్న కోపంతో పెళ్లి మాత్రం వద్దనుకుని ఉంటాడు. వాట్ ఏ దేశభక్తి! ఒకేసారి ఇన్ని షాకులు తిన్నాక నిద్ర ఎలా పడుతుంది? ఉన్న ఒక్క నిద్ర మాత్ర పాలలో కలిపి అశుతోష్‌కి ఇచ్చేసానే! హయ్యో!

మర్నాడు పొద్దున్న అనిర్బాన్‌ని కలిసాను.

నాకు బెంగాలీలో 'I came to know about your infidelity. I don't want to stay with you anymore. We should break-up' అనడానికి ఏమంటారో చెప్పవా? అని అడిగాను. తను ఎప్పటిలాంటి సమాధానమే ఇచ్చాడు. ఒక నవ్వు! కాకపోతే ఈసారి విరక్తిగా.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*16 జులై 2017*

✱




రిషి శ్రీనివాస్ 8 ఆగస్టు 1989న విజయనగరంలో జన్మించారు. మొదటి కథ **రెక్కలు** 2014లో ఈనాడు ఆదివారం సంచికలో అచ్చయింది. దాదాపు పదిహేను కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

***చిరునామా: 1-9-3, 206, మగధ టవర్స్, స్ట్రీట్ నెం. 1, రామ్‌నగర్ జమిస్తాన్‌పూర్, హైదరాబాద్ - 500 020.***
***ఫోన్: 76808 21010 srinivasarishi@gmail.com***